సాక్షి విశాఖపట్నం

సోమవారం । 10 ఏప్రిల్ । 2023



వీధి బాలల భవితకు భరోసా!

అనాథలు, వీధిబాలలకు అండగా 'నేతాజీ సుభాష్ చంద్రబోస్ అవసియ హాస్టళ్లు' ఏర్పాటు చేసింది. 8లో




అన్నదాతా సుఖీభవ

ఎవరూ ఆకలితో ఉండకూడదన్న సదాశయంతో హరేకృష్ణ మూవ్‌మెంట్ కేజీహెచ్‌లో అన్నదానం చేస్తోంది. 8లో



'సన్' రేజయ్యాడు

ఏప్రిల్‌లోనే ఎండలు మండిపోతున్నాయి. ఆదివారం సన్ రేజయ్యాడు. వేసవి, ఎండ వేడిమితో నగరవాసులు విలవిల్లాడారు. 8లో



విదేశీ కళ



విదేశీ విద్యార్థుల ఉత్సాహం ఆకాశం అంచులు తాకింది. ఆయా దేశాల సంప్రదాయ దుస్తుల్లో... విభిన్న సాంస్కృతిక ప్రదర్శనలతో అదరగొట్టేశారు. ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఐసీసీఆర్ 73వ వ్యవస్థాపక దినోత్సవం, ఏయూ అంతర్జాతీయ విద్యార్థుల వార్షిక సమ్మేళనం కనులపండువగా జరిగింది. 10లో

ఈస్టర్ వేడుక



క్రైస్తవులు ఉత్సాహంగా జరుపుకునే పాస్కా(ఈస్టర్) ఉత్సవం ఘనంగా జరిగింది. మృత్యుంజయుడైన క్రీస్తును స్తుతించే ప్రార్థనలనే పాస్కాగా పిలుస్తారని విశాఖ ఆర్చిబిషప్ రెవరెండ్ ఫాదర్ ప్రకాష్ అన్నారు. 8లో

న్యూస్‌రీల్

చందనోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు



సింహగిరిపై ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆజాద్

- కొండ దిగువనే ప్రసాద విక్రయాలు
- ప్రత్యేకాధికారి ఆజాద్

సింహాచలం: ఈ నెల 23న చందనోత్సవాన్ని పురస్కరించుకుని సింహగిరిపై జరుగుతున్న ఏర్పాట్లను దేవదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్, ఉత్సవ ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ ఆజాద్ ఆదివారం పరిశీలించారు. భక్తుల దర్శన క్యూల్లో చేయాల్సిన ఏర్పాట్లపై సూచనలిచ్చారు. చందనోత్సవం విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామని ఈ సందర్భంగా ఆజాద్ తెలిపారు. ఈసారి ప్రసాద విక్రయాలు పూర్తిగా కొండదిగువే పెట్టేందుకు యోచన చేస్తున్నామని చెప్పారు. చందనోత్సవంలో సామాన్య భక్తులకే పెద్ద పీట వేస్తామన్నారు. దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు శ్రీనివాసరాజు, రాంబాబు ఆజాద్‌కు ఏర్పాట్లను వివరించారు.

జపాన్‌కు టీటీ ఆటగాళ్లు



ఎంపికైన టీటీ ఆటగాళ్లు

విశాఖ స్పోర్ట్స్ : పదిరోజుల పాటు జపాన్ ఆటగాళ్ల టెక్నిక్, మెళకువల్ని నేర్చుకునేందుకు నలుగురి టేబుల్‌టెన్నిస్ ఆటగాళ్లను ఎంపిక చేశారు. బాలికల విభాగంలో కాజోల్ సునర్, ఫాల్గుణ్‌చార్వి, బాలుర విభాగంలో సూర్యతేజ, వెంకటకార్తికేయలను శిక్షణకు పంపనున్నారు. వీరంతా ఇటీవల స్వర్ణభారతి స్టేడియంలో జరిగిన అంతరజిల్లాల టీటీ పోటీల్లో సత్తాచాటారు. రోటరీ విశాఖ వ్యాలీ,ఎల్ ఏంజిల్ ఇంటర్నేషనల్ వాలంటీర్స్ సంఘం, జపాన్ సంయుక్త ఆధ్వర్యంలో వీరంతా ఈనెల 20వ తేదీన బయలుదేరనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రోటరీక్లబ్ విశాఖ వ్యాలీ రోటేరియన్లు జానకీరామ్, పాండురంగారావు, హనుమంతరావు పాల్గొన్నారు.

గీతాభవన్‌లో విద్యాప్రకాశ నందగిరి జయంతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాసానంద సరస్వతి

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): పాతనగరం వన్‌టౌన్ రాజప్పనాయుడు వీధిలో గల గీతాభవన్‌లో గీతాప్రచార సమితి ఆధ్వర్యంలో విద్యాప్రకాశనందగిరి స్వామి జయంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి భక్తులనుద్దేశించి మాట్లాడారు. శ్రీకృష్ణ పరమాత్ముడు ప్రసాదించిన భగవద్గీత సారాంశాన్ని తన ప్రసంగం ద్వారా భక్తులకు బోధించి తన పరిపూర్ణ జీవితాన్ని భగవద్గీతకు అంకితం చేసిన మహనీయుడు విద్యాప్రకాశనందగిరి అని అన్నారు. గీతామకరందం ద్వారా తెలుగువారి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. గీతా ప్రచార సమితి చేపడతున్న ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు ప్రశంసించారు. కార్యక్రమంలో గీతా ప్రచార సమితి గౌరవాధ్యక్షుడు వై.కృష్ణమూర్తి, అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పి.జగన్మోహనరావు, ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్, కురిచేటి శ్రీరామచంద్రమూర్తి, గీతా ప్రచార సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వేటకు విరామం



విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో మరబోట్లు

- 14 అర్ధరాత్రి నుంచి జూన్ 15 వరకు నిషేధం
- విశాఖ జిల్లాలో 1,986 మర, మెకనైజ్డ్ బోట్లు
- సంప్రదాయ తెప్పలు, పడవలకు మినహాయింపు
- వేట విరామ సమయంలో రూ.10 వేల చొప్పున పరిహారం
- 15 వేల మంది మత్స్యకారులకు లబ్ధి
- మేలో బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ

సాక్షి, విశాఖపట్నం: మత్స్యకారుల చేపల వేటకు విరామం లభించనుంది. ఏటా ఏప్రిల్ 14 అర్ధరాత్రి నుంచి జూన్ 15 అర్ధరాత్రి వరకు చేపల వేటపై నిషేధం అమలులో ఉంటుంది. ఈ 61 రోజుల్లో సముద్రంలో మత్స్య సంతతి వృద్ధి, సంతాన ఉత్పత్తికి వీలుగా కేంద్ర ప్రభుత్వం ఎన్నో ఏళ్ల నుంచి ఈ విరామాన్ని అమలు చేస్తోంది. సముద్రంలో చేపలవేట సాగించే మరబోట్లు, వెసల్స్, ట్రాలర్ల వల్ల మత్స్య సంపదకు హాని కలుగుతుందన్న ఉద్దేశంతో వీటితో వేటను నిషేధించింది. అయితే మోటార్లు లేని సంప్రదాయ తెప్పలు, నాటు పడవలకు మినహాయింపునిచ్చారు. నిషేధ సమయంలో ఈ తెప్పలు/పడవలు సముద్ర తీరం నుంచి ఎనిమిది కిలోమీటర్ల లోపు చేపలవేటకు అనుమతిస్తారు. విశాఖ జిల్లాలో యారాడ నుంచి భీమునిపట్నం వరకు ఉన్న తీర ప్రాంత పరిధిలో 1,986 మరబోట్లు (మెకనైజ్డ్ బోట్లు) వేట సాగిస్తున్నాయి. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో 720 మరబోట్లు, ఇతర ప్రాంతాల్లో 1,266 మోటారైజ్డ్ బోట్లు ఉన్నాయి. ఇవికాకుండా నాన్ మోటారైజ్డ్ (ఇంజను లేని) బోట్లు 417 ఉన్నాయి. వీటిలో నాన్ మోటారైజ్డ్ మినహా మెకనైజ్డ్, మోటారైజ్డ్ బోట్లు ఈనెల 14 అర్ధరాత్రి నుంచి వేటకు వెళ్లడానికి వీల్లేదు. అప్పటికి సముద్రంలో ఎక్కడెక్కడికో వేటకు వెళ్లిన బోట్లన్నీ ఒడ్డుకు/హార్బర్‌కు చేరుకోవలసి ఉంటుంది. అప్పటికీ ఒడ్డుకు రాని బోట్లకు జరిమానా విధిస్తారు. ఏదైనా సాంకేతిక కారణాలతో చేరుకోలేని వాటికి మాత్రం జరిమానా నుంచి మినహాయింపునిస్తారు. ఇప్పటికే వేటకు వెళ్లిన కొన్ని మెకనైజ్డ్ బోట్లు తిరుగుముఖం పట్టాయి.

రూ.10 వేల పరిహారం

చేపలవేట నిషేధం అమలులో ఉండడం వల్ల మత్స్యకారుడికి ఆదాయం ఉండదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం కింద రూ.10 వేల పరిహారం కింద చెల్లిస్తోంది. మెకనైజ్డ్ బోటుకు ఎనిమిది మంది, మోటారైజ్డ్ బోటుకు ఆరుగురు, నాన్‌మోటారైజ్డ్ బోటులో ముగ్గురు చొప్పున (బోటు యజమాని సహా) మత్స్యకార భరోసాకు అర్హులుగా నిర్ణయించారు. ఇలా విశాఖపట్నం జిల్లాలో దాదాపు 15 వేల మంది వరకు పరిహారం (భరోసా) సొమ్ము అర్హత పొందే అవకాశం ఉందని భావిస్తున్నారు. అర్హులను ఎంపిక చేయడానికి ఈనెల 17వ తేదీన మత్స్యశాఖ అధికారులు ఎన్యూమరేషన్ చేపడ్తున్నారు. మత్స్యకారులు ఆరోజు బోట్ల డాక్యుమెంట్లు, బ్యాంకు ఖాతాల నంబర్లు, ఆధార్ కార్డులను సమర్పించాల్సి ఉంటుంది. మత్స్యకారులు ఈ పరిహారం సొమ్ము పొందడానికి దరఖాస్తు ఫారాన్ని నింపాల్సి ఉంటుంది. ఇప్పటికే మత్స్యశాఖ అధికారులు వీటిని ఆయా మత్స్యకార ప్రాంతాలకు పంపించారు. భరోసా సొమ్మును సంబంధిత మత్స్యకారుని బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం నేరుగా జమ చేస్తుంది.

విరామ సమయంలో ఇలా..

చేపలవేట విరామ సమయంలో బోటు యజమానులు తమ బోట్లకు మరమ్మతులు చేయించుకుంటారు. ఇంజను గేర్ బాక్సులు, ఆయిల్, వాటర్, కేబిన్, పంఖాలు, బుష్‌లు వంటి వాటికి రిపేర్లు చేయించుకుని బోటు కండిషన్‌లో ఉంచుకుంటారు. అలాగే వలలకు కూడా మరమ్మతు పనులు చేపడతారు. బోట్లలో వేటకెళ్లే మత్స్యకార సిబ్బంది (క్రూ) స్థానికంగా లభించే పనులకు వెళ్తుంటారు.

నిబంధనలను అతిక్రమిస్తే..

ఈనెల 14 అర్ధరాత్రి నుంచి జూన్ 15వ తేదీ అర్ధరాత్రి వరకు చేపలవేట నిషేధం అమలులో ఉంటుంది. ఆ సమయంలో ఎవరైనా చేపలవేట సాగిస్తే పట్టుబడిన చేపలను వేలం వేస్తారు. రూ.2 వేల వరకు జరిమానా విధిస్తారు. సంవత్సరం పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నిలిపివేస్తారు.



అందమైన తెలుగమ్మాయిలు మెరుపు తీగల్లా హంస నడకతో ఆకట్టుకున్నారు. నగరంలోని ఓ హోటల్‌లో తెలుగు అమ్మాయి ఆడిషన్లు జరిగాయి. 8లో

విస్తృతంగా కోవిడ్ పరీక్షలు

నేటి నుంచి రోజుకు 200 మందికి



మహారాణిపేట: విశాఖలో కరోనా కేసులు రోజురోజుకూ పెరుగుతుండడంతో పరీక్షల సంఖ్య పెంచాలని నిర్ణయించారు. ప్రస్తుతం జిల్లాలో రోజుకు 50 పరీక్షలు చేస్తున్నారు. ఈ సంఖ్యను సోమవారం నుంచి 200కు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. లక్షణాలు కలిగిన వారికి పరీక్షలు చేయాలని నిర్ణయించారు. జ్వరం, దగ్గు, తలనొప్పి, ఇతర లక్షణాలు ఉంటే తక్షణం పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. 3 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 63 పట్టణ ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీఎస్) సోమవారం నుంచి రోజుకు 200 మందికి పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. అలాగే వైఎస్సార్ హెల్త్ కేర్ సెంటర్‌లో కూడా పది కిట్లు సిద్ధంగా ఉంచుతున్నారు.

నేటి నుంచి మాక్ డ్రిల్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నారు. విశాఖలో కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో , ప్రయివేటు ఆస్పత్రుల్లో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. కోవిడ్‌ను ఎదుర్కొవడానికి సన్నద్ధత లేని ఆస్పత్రుల్లో తక్షణం ఆ ఏర్పాట్లు చేసుకోవాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు. కేజీహెచ్, ఈఎన్‌టీ, చెస్టు ఆస్పత్రి, విమ్స్, మెడికవర్, విమ్స్ ఐకాన్, కేర్, అపోలో, మూడు కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు, వైద్య ఆరోగ్య కేంద్రం (అంగన్‌పూడి) తదితర సెంటర్లలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్టు డీఎంహెచ్‌వో తెలిపారు.

12 కరోనా కేసుల నమోదు

విశాఖలో ఆదివారం 12 కరోనా కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటల్లో 114 మందికి పరీక్షలు నిర్వహించారు. మొత్తం కరోనా సోకిన వారి సంఖ్య 32కు చేరుకుంది. వీరిలో ఏడుగుర్ని డిశ్చార్జ్ చేశారు. మిగిలిని వారు చికిత్స పొందుతున్నారని డీఎంహెచ్‌వో వివరించారు.

క్యాన్సర్, కరోనా కంటే చంద్రబాబే డేంజర్

- సెల్ఫీలతో సెల్ఫ్ డబ్బా మానుకో చంద్రబాబు
- నాడు మీ ప్రభుత్వంలో..నేడు మా పాలనలో అభివృద్ధిపై సెల్ఫీలకీ రెడీ
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి వ్యాఖ్యలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్‌ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

సాక్షి, విశాఖపట్నం: క్యాన్సర్, కరోనాల కంటే చంద్రబాబే హానికరమని..ఆయన కారణంగానే రాష్ట్రానికి అనేక సమస్యలు వచ్చాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. రాష్ట్ర ప్రజలంతా సీఎం వై.ఎస్ జగన్‌ను సొంత బిడ్డలా ఆదరిస్తుంటే..అది తట్టుకోలేకపోతున్న చంద్రబాబు పిచ్చి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. నిజానికి ఆనాడు ప్రత్యేక హోదాను తుంగలోకి తొక్కిన క్యాన్సర్ గడ్డ ఎవరు? చంద్రబాబు కాదా? ముడుపుల కోసం పోలవరం ప్రాజెక్టు పనులను నాశనం చేసింది చంద్రబాబు కాదా? పదేళ్లు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌లో ఉండే అవకాశం ఉన్నా, ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయి, రాత్రికి రాత్రి పారిపోయి వచ్చింది ఎవరు? చంద్రబాబు కాదా? అలా ఆంధ్ర రాష్ట్ర ప్రజల లక్షల కోట్ల ఆస్తిని హైదరాబాద్‌లో వదిలి వచ్చిన క్యాన్సర్ గడ్డ చంద్రబాబు అని విమర్శించారు. ఆదివారం మద్దిలపాలెం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం విస్తృతంగా కొనసాగుతోంది. జగనన్నే మా భవిష్యత్తు నినాదంతో వైఎస్సార్‌సీపీ సైనికులు గడగడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలను, అభివృద్ధిని వివరిస్తున్నారన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారన్నారు. దిశ యాప్, దిశ పోలీస్ స్టేషన్‌లను ఏర్పాటు చేసి దేశంలోనే ఎక్కడా లేని విధంగా మహిళల భద్రతకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం కల్పిస్తోందని కొనియాడారు. అలాగే మహిళలపై నేరాల విచారణకు 13 ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసిందన్నారు. వీటి ద్వారా రాష్ట్రంలో 3,143 కేసుల్లో వారం రోజుల్లోపే విచారణ పూర్తి చేశారు. 60 రోజుల లోపు విచారణ పూర్తైన కేసులు చూస్తే.. 2021లో 91.69%, 2022లో 88.79%, 2023లో 94.74% కేసుల విచారణ 60 రోజుల్లో పూర్తయ్యాయన్నారు. అదే చంద్రబాబు హయాంలో 60 రోజులలోపు విచారణ పూర్తయిన కేసులు 12.88% శాతం కూడా లేవన్నారు.

అభివృద్ధిపై సెల్ఫీలకు రెడీ

నాడు మీ ప్రభుత్వంలో..నేడు మా పాలనలో అభివృద్ధిపై సెల్ఫీలకీ రెడీనా చంద్రబాబు అని వరుదు కల్యాణి సవాల్ విసిరారు. గ్రామాల్లో సచివాలయాలు, జగనన్న కాలనీ, విలేజ్ క్లినిక్, అర్బన్ హెల్త్ క్లినిక్‌లు, ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల వద్ద సెల్ఫీ దిగుదాం ..మార్పు ప్రజలే చెబుతారన్నారు. సెల్ఫీలతో సెల్ఫ్ డబ్బా కొట్టడం మానుకో చంద్రబాబు..సీఎం జగనన్న పూర్తి చేసిన టిడ్కో ఇళ్ల దగ్గర చంద్రబాబు సెల్ఫీ దిగడం ఏంటని ప్రజలు నవ్వుతున్నారన్నారు. ఐదేళ్ల టీడీపీ ప్రభుత్వంలో 3.13 లక్షల ఇళ్లు కట్టిస్తానన్న చంద్రబాబు 50 శాతం కూడా పూర్తి చేయని విషయం గుర్తుచేశారు.. అదే మా ప్రభుత్వం వచ్చిన తర్వాత, వాటి పనులు పూర్తి చేసి, ఇప్పటికే 50 వేల ఇళ్లు లబ్ధిదారులకు ఇచ్చాం. రెండు నెలల్లో మరో 40 వేల ఇళ్లు నిరుపేదలకు ఇవ్వబోతున్నాం. మొత్తంగా 1.30 లక్షల టిడ్కో ఇళ్లు ప్రజలకు ఇవ్వటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇంకా రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షలకు పైగా ఇళ్ల పట్టాలు ఇవ్వడమే కాకుండా, 21.25 లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. ఈరోజు ఏకంగా 17 వేలకు పైగా జగనన్న కాలనీలు.. కొన్ని చోట్ల ఏకంగా ఊళ్ల నిర్మాణమే జరుగుతోందన్నారు.

టీడీపీ హయాంలోనే ఏరులై పారిన మద్యం

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 43 వేలకు పైగా బెల్టు షాప్‌లు, వైన్‌షాప్‌ల దగ్గర 4500 పర్మిట్‌రూమ్‌లు ఉంటే... మా ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటన్నింటినీ రద్దు చేశామన్నారు. మద్యం షాపులను కూడా మూడో వంతు తగ్గించిన విషయం గుర్తుచేస్తున్నానన్నారు. చంద్రబాబు హయాం నాటి 2018-19తో 2021-22 పోలిస్తే లిక్కర్ అమ్మకాలు 27.54శాతం, బీర్ల అమ్మకాలు 70శాతం తగ్గాయన్నారు. మా ప్రభుత్వాన్ని, సీఎంను విమర్శించే హక్కు టీడీపీ మహిళా వీర'అనిత'కు లేదని వరుదు కల్యాణి మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం రీజనల్ మహిళా అధ్యక్షురాలు బి.పద్మావతి, విశాఖ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కృపాజ్యోతి, ముఖ్యనేతలు అల్లంపల్లి రాజుబాబు, పేర్ల విజయచందర్, బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

లలితా పీఠంలో సంకటహర చతుర్థి



లక్ష్మీగణపతి హోమం చేస్తున్న పండితులు

సీతంపేట (విశాఖ ఉత్తర) : సంకటహర చతుర్థి సందర్భంగా ఆదివారం లలితానగర్ లలితా పీఠంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. గణపతికి ప్రీతిపాత్రమైన తిథుల్లో చతుర్థి ఒకటని, కష్టాల నుంచి గట్టెక్కించే సంకటహర చతుర్థి వ్రతం ఎంతో విశిష్టమైనదని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. పీఠం అర్చకుల మంత్రోచ్చారణల మధ్య దూప దీప నైవేద్యం, గణేశ స్తోత్రం, వ్రత కథ చదివారు. అనంతరం పీఠం దర్బారు హాల్లో శాస్త్రోక్తంగా గణపతి హోమం చేశారు. ఈ హోమం వల్ల కార్యసిద్ధి, ఆరోగ్యం, విజయం లభిస్తాయని అర్చకులు తెలిపారు.

నేడు వారాహి హోమం : బహుళ పంచమి సందర్భంగా సోమవారం సాయంత్రం 6.30 గంటలకు లలితా పీఠంలో వారాహి హోమం జరుగుతుందని కృష్ణసేన్ చెప్పారు. సీతంపేట కూడలిలోని దుర్గాగణపతి ఆలయం, శంకరమఠం రోడ్‌లోని విజయ గణపతి ఆలయంలో సంకటహర చతుర్థి పూజలు చేశారు.

ముగిసిన ఎన్టీపీసీ ప్రీమియర్ లీగ్



షీల్డ్‌ను ప్రదర్శిస్తున్న సంస్థ జీజీఎం సిన్హా, క్రీడాకారులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ప్రీమియర్ లీగ్-23 ముగిసింది. గత నెల 11న ప్రారంభమైన ఈ పోటీల్లో 15 జట్లు పాల్గొని 39 మ్యాచ్‌లు ఆడాయి. స్థానిక క్రీడా మైదానంలో ఆదివారం జరిగిన ఫైనల్ పోటీల్లో మైటీ మార్వెల్స్, ఆపరేషన్ గ్రూప్-ఏ టైటాన్స్ తలపడ్డాయి. హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో రెండు పరుగుల తేడాతో ఆపరేషన్-ఏ టైటాన్స్ చాంపియన్‌గా నిలిచింది. బెస్ట్ బ్యాటర్‌గా సౌరభ్(సీహెచ్‌పీ రార్స్), ఉత్తమ బౌలర్‌గా ఉదయ్(జీఆర్-ఏ టైటాన్స్), ఉత్తమ వికెట్ కీపర్‌గా గంగరాజు(మైటీ మార్వెల్స్), మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా మిస్టర్ సౌరభ్(సీహెచ్‌పీ రార్స్) ఎంపికయ్యారు. ఫైనల్ మ్యాచ్‌కు సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా ముఖ్య అతిథిగా పాల్గొని.. ఇరు జట్ల ఆటను తిలకించారు. అద్భుతమైన మ్యాచ్‌లను నిర్వహించిన స్పోర్ట్స్ కౌన్సిల్‌ను జీజీఎం సిన్హా అభినందించారు. విజేతలకు జ్ఞాపికలు బహూకరించారు. సీజీఎం గోవిందరాజన్, ఓ అండ్ఎం జీఎం డీపీ పాత్రో, ఉన్నతాధికారులు వి.ఎం.చౌదరి, మాథ్యూ, ఆర్ఆర్ ఫరిదా, హెచ్ఆర్ రుమాడీ శర్మ, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

కళ్లమంటలు... ఉక్కిరిబిక్కిరి

- లారీ నుంచి రసాయనాల లీక్‌తో ఆందోళన

సాక్షి, అనకాపల్లి: జేఎన్ ఫార్మాసిటీలో మైలాన్ పరిశ్రమకు తరలిస్తున్న ప్రమాదకరమైన రసాయన పదార్థం(థియో ఫినాల్) లీక్ అవ్వడంతో సమీప ప్రజలు అస్వస్థతకు గురయ్యారు. పరవాడ మండలం లంకెలపాలెం ఏలేరు కాలువ సమీపంలో గడువు తీరిన థియో ఫినాల్ విషవాయువు వ్యాన్‌లోని డ్రమ్ముల నుంచి లీక్ అయ్యింది. దీంతో ఆ ప్రాంతంలో కలకలం రేగింది. ఒక్కసారిగా కళ్లమంటలు రావడంతో లంకెలపాలెం పరిసర ప్రజలు, ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరయ్యారు. వ్యాన్‌లో లీకైన డ్రమ్ములను అధికారులు గుర్తించి, ఆ రసాయనాన్ని వేరే డ్రమ్ముల్లోకి మార్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కారణమైన వారిపై అధికారులు చర్యలు చేపట్టారు. అయితే విషవాయువు ఎక్కడనుంచి వస్తుందో తెలుసుకునేందుకు సుమారు 2 గంటల సమయం పట్టింది. సంస్థ నిర్లక్ష్యం కారణంగానే ప్రజలు ఇబ్బంది పడ్డారు.

గిరిజన ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక



సంఘీభావం తెలుపుతున్న ఉద్యోగులు

ఏయూ క్యాంపస్: రాష్ట్ర గిరిజన ఉద్యోగుల సంఘం కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగా నిర్వహించిన రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా వై.వెంకటేశ్వర్లు (కృష్ణా జిల్లా), అధ్యక్షుడిగా కోరాబు సత్యనారాయణ(విశాఖపట్నం జిల్లా), ప్రధాన కార్యదర్శిగా దినారి ప్రభాకర్(నెల్లూరు), వైస్ చైర్మన్‌గా కె.బ్రహ్మయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.బాలు నాయక్, కోశాధికారిగా జి.వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. వీరితో పాటు ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లను ఎన్నుకున్నారు.

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	420.00
విజయనగరం	424.00
శ్రీకాకుళం	424.00

అన్నదాతా సుఖీభవ

- 11 ఏళ్లుగా కేజీహెచ్ రోగుల సహాయకులకు 'సుభోజనం'
- హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో నిత్యసేవ

ఎవరూ ఆకలితో ఉండరాదన్న ఆశయంతో విశాఖకు చెందిన హరేకృష్ణ మూవ్‌మెంట్, టచ్‌స్టోన్ చారిటీస్ ఆధ్వర్యంలో సుభోజనం పేరిట రోగులు, వారి సహాయకులకు చక్కటి భోజనం అందిస్తున్నారు. వైద్యసేవల పరంగా ఉత్తరాంధ్ర జిల్లాలకు పెద్ద దిక్కుగా ఉన్న కింగ్ జార్జి ఆస్పత్రిలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి నిత్య సేవ చేస్తున్నారు. దాతల చేయూత లేని రోజుల్లో రూ. 30 వసూలు చేస్తున్నారు. కేజీహెచ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కౌంటర్ 11 ఏళ్లకు పైగా సేవలందిస్తోంది.



సుభోజనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ లవ్ అగర్వాల్, జేసీ గిరిజా శంకర్ (ఫైల్)



కేజీహెచ్ సుభోజనం కౌంటర్‌లో రోగుల సహాయకులకు భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

మహారాణిపేట : హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆశ్రమాలకు 10కిలోమీటర్ల పరిధిలో ఏ ఒక్కరూ ఆకలితో ఉండరాదన్న సదాశయంతో 2011 నవంబర్ 21న నాటి ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్, అప్పటి కలెక్టర్ లవ్ అగర్వాల్, జాయింట్ కలెక్టర్ గిరిజా శంకర్ కేజీహెచ్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ వ్యవస్థాపక గురువు శ్రీల భక్తి వేదాంత స్వామి ప్రభుపాదుల ఆశయాలకు అనుగుణంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కేజీహెచ్‌లో ఈ కౌంటర్ ప్రారంభించక ముందు అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనానికి రోగుల సహాయకులకు ఎంత తక్కువలో చూసుకున్నా ప్రతి రోజూ రూ.150వరకు ఖర్చు అయ్యేది. ఈ పరిస్థితిని గమనించిన హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆస్పత్రి ఆవరణలో ఈ సదుపాయం ప్రారంభించి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి ఉచితంగా భోజనం అందిస్తోంది. సంవత్సరంలో 365 రోజులూ ఈ సదుపాయాన్ని కొనసాగిస్తోంది.

మేము సైతం .. : ఈ కార్యక్రమం గురించి తెలుసుకున్న పూర్వ వైద్య విద్యార్థులు డాక్టర్ రవి, శేషశర్మ ఆంధ్ర వైద్య కళాశాల శతాబ్ది వేడుకల సందర్భంగా ప్రతి రోజూ ఉచితంగా 400 మందికి ఏడాది పాటు భోజన వితరణ చేయాలని నిర్ణయించుకున్నారు. తమ తల్లిదండ్రులు వడ్లమాని అన్నపూర్ణేశ్వరరావు, పద్మావతి గౌరవార్థం ఏడాది పాటు రోజుకు 400 మందికి భోజనాలకు అయ్యే ఖర్చును భరించారు.

మెనూ ఇలా.. : సుభోజనం ద్వారా ఉదయం ఇడ్లీ, ఉప్మా, మధ్యాహ్నం అన్నం, కూర, సాంబారు, మజ్జిగ, రాత్రి కూడా మధ్యాహ్నం లాగే అందజేస్తున్నారు. ప్రతి రోజూ 1000 నుంచి 1200 మందికి భోజనం పెడుతున్నారు. దాతల సహకారంతో నెలలో 20 నుంచి 25 రోజులు ఈ కార్యక్రమం కొనసాగుతుండగా.. మిగిలిన రోజుల్లో హరేరామ హరేకృష్ణ మూవ్‌మెంట్ వారే నిర్వహిస్తున్నారు. ఇందులో కేజీహెచ్ వైద్యులు కూడా భాగమయ్యారు.

సేవకు వయసుతో సంబంధం లేదు



సేవ చేయాలని ముందుకు వచ్చాను. వైద్య ఆరోగ్యశాఖలో పని చేసి రిటైర్ అయ్యాను. హరేకృష్ణ మూవ్‌మెంట్ చేపడుతున్న ఈ కార్యక్రమంలో భాగం అయ్యాను. నాకు 70 ఏళ్లు. 11 ఏళ్లుగా కేజీహెచ్ సుభోజనం కౌంటర్ వద్దకు వచ్చిన వారికి భోజనాలు వడ్డిస్తున్నాను.

–పిల్లల షణ్ముఖరావు, స్వచ్ఛంద సేవకుడు

సహాయకుల ద్వారా ప్రచారం



ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందుతున్న రోగి సహాయకుల నుంచి విస్తృత ప్రచారం లభిస్తోంది. పలువురు దాతలు ముందుకు వచ్చి ఉచితంగా ఆహారం అందిస్తున్నారు. వారి ఇళ్లలో జరిగే పుట్టిన రోజులు, పెళ్లి రోజులు, ఇతర కార్యక్రమాల సమయంలో రోగి సహాయకులకు ఉచితంగా ఆహారం అందిస్తున్నారు. ఇలా నెలలో సుమారు 20 రోజుల పాటు సేవలు కొనసాగుతున్నాయి. ఉచిత భోజన వితరణ కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలందరికీ కృతజ్ఞతలు. మరిన్ని వివరాలకు యదు రాజదాస (9010611108), జీతమిత్ర దాస (8184887108)లను సంప్రదించాలి.

–డాక్టర్ నిష్కించిన భక్తదాస, అధ్యక్షుడు, హరేకృష్ణ మూవ్‌మెంట్, టచ్‌స్టోన్ చారిటీస్

భోజనం ఎంతో బాగుంది



నేను కొయ్యూరు మండలం నిమ్మలపాలెం గ్రామానికి చెందిన గిరిజనుడిని. నా భార్యకు ఒంట్లో బాగోలేక కొద్ది రోజుల క్రితం కేజీహెచ్‌లో చేర్పించాను. నా భార్య ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు తోడుగా ఉన్న నేను ప్రతి రోజూ ఇక్కడ భోజనం చేస్తున్నాను. ఈ భోజనం ఎంతో బాగుంది. శాకాహార భోజనం అందిస్తున్నారు. తృప్తిగా భోజనం చేస్తున్నాను. చాలా సంతోషంగా ఉంది. భోజన నిర్వాహకులకు ధన్యవాదాలు.

– వంతల పాండురాజు, నిమ్మలపాలెం, కొయ్యూరు మండలం, అల్లూరి జిల్లా

బాలికతో అసభ్యకర ప్రవర్తన

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలికపై ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయం గమనించిన స్థానికులు అక్కడకు చేరేలోగా ఆ వ్యక్తి పరారయ్యాడు. ఆరిలోవ సీఐ సోమశేఖర్ తెలిపిన వివరాలివీ.. శ్రీకాంత్‌నగర్ సమీపం నలబై గజాల కాలనీకి చెందిన బాలిక నాలుగో తరగతి చదువుతోంది. ఆమె తల్లిదండ్రులు కూలి పనులు చేస్తుంటారు. ఆదివారం సాయంత్రం ఇంటి బయట ఉన్న ఆ బాలికకు ఓ వ్యక్తి మాయమాటలు చెప్పి.. తన బైక్‌పై ఎక్కించుకుని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. అక్కడ ఆ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తిస్తుండగా అటుగా వెళ్లిన కొందరు గమనించారు. అక్కడకు వెళ్లే సరికి.. ఆ వ్యక్తి బైక్‌పై వెళ్లిపోయాడు. దీంతో వారు ఆరిలోవ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఏం జరిగిందని బాలికను ప్రశ్నించారు. ఆ బాలిక సరైన సమాధానం చెప్పలేకపోతుంది. దీంతో బాలిక తల్లిదండ్రులకు పోలీసులు సమాచారమిచ్చారు. నలబై గజాల రోడ్డు, స్కిల్ డెవలప్‌మెంట్ వద్ద అందుబాటులో ఉన్న సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. అతని కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు.

బేడీలతో పరారైన నిందితుడి కోసం గాలింపు

చెన్నైలో ఉన్నట్లు సమాచారం

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి బేడీలతో పరారైన నిందితుడు సత్తిబాబు చెన్నైలో ఉన్నట్లు సమాచారం. దీంతో ఫోర్త్‌టౌన్ పోలీసులు చెన్నై వెళ్లారు. చోడవరం మండలం లక్ష్మీపురానికి చెందిన సియాదుల సత్తిబాబు ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి శనివారం ఉదయం పరారైన సంగతి తెలిసిందే. దీంతో పోలీసులు నగరంతో పాటు లక్ష్మీపురం గ్రామం, సింహాచలం కొండ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే అతని ఆచూకీ లభించలేదు. దీంతో విశాఖ రైల్వేస్టేషన్‌లోని సీసీ ఫుటేజ్‌లు పరిశీలించగా.. చెన్నై వెళ్లే రైలు ఎక్కినట్లు గుర్తించారు. దీంతో ఎస్‌ఐ, సిబ్బంది చెన్నైలో గాలింపు చర్యలు చేపడుతున్నట్లు సమాచారం.

ఘనంగా ఈస్టర్ వేడుకలు





ఫ్లేమ్‌ను ప్రారంభిస్తున్న బిషప్ మల్లవరపు ప్రకాష్, కొవ్వొత్తులతో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

కంచరపాలెం: క్రైస్తవులు ఉత్సాహంగా జరుపుకునే పాస్కా(ఈస్టర్) ఉత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. మృత్యుంజయుడైన క్రీస్తును స్తుతించే ప్రార్థనలనే పాస్కాగా పిలుస్తారని, గుడ్‌ఫ్రైడే మరుసటి రోజు రాత్రి 12 గంటల తర్వాత ఏసుక్రీస్తు సమాధి నుంచి బయటకు వస్తారని క్రైస్తవులు విశ్వసిస్తారని విశాఖ ఆర్చిబిషప్ రెవరెండ్ ఫాదర్ మల్లవరపు ప్రకాష్ అన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ రక్షణగిరిలో పునీత పేతూరు రాయప్ప దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ నేతృత్వంలో జాగరణ, దివ్యపూజా బలులు, ప్రార్థనలు నిర్వహించారు. మృత్యుంజయుడైన క్రీస్తును సెయింట్ పీటర్స్ ప్రధాన దేవాలయానికి తీసుకొచ్చారు. రక్షణగిరిని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడ దివ్యపూజా బలులు సమర్పించారు. పారిస్ పాస్టల్ కౌన్సిల్(పీపీసీ) సభ్యులు అమర్, ఆదిరెడ్డి చార్లీ, ఆనందరావు, బేతా జోసెఫ్, బోరా శేషుబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆరిలోవ: ఈస్టర్ సందర్భంగా పాత జైల్‌రోడ్డు సమీపంలో సమాధుల వద్ద క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. ఇందులో భాగంగా భర్త సమాధి వద్ద భార్య ప్రార్థన చేస్తుండగా.. ఎండ నుంచి ఉపసమనం కోసం ఆమె కుమారుడు గొడుగు అడ్డుపెట్టాడు.

11న చలో విజయవాడ



మాట్లాడుతున్న దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్

సీతంపేట: దేశంలో, రాష్ట్రంలో దళితులపై దాడులు, హత్యలు పెరిగాయని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ ధ్వజమెత్తారు. అంబేడ్కర్ భవన్‌లో దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలనలో దళితులు, ఆదివాసీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. దేశం ప్రమాదంలో పడిందని, రాజ్యాంగాన్ని మార్చేయడానికి కుట్రలు సాగుతున్నాయని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 11న దళిత, బహుజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామని.. విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు మాట్లాడుతూ దేశంలో దళితులు ఇంకా అంటరానితనం, అణచివేత, దాడులకు గురవుతూనే ఉన్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార చట్టం అమలు బాధ్యత కలెక్టర్, పోలీస్ అధికారులదే అన్నారు. భీమ్‌సేన వ్యవస్థాపకుడు రవిసిద్ధార్థ, సీపీఎం నాయకులు కుమార్, సీపీఐ ప్రతినిధి చంద్రశేఖర్, కేవీపీఎస్ నాయకులు టి.చిరంజీవి, సుబ్బన్న, రాజు, బీహెచ్‌పీఎస్ నాయకులు జి.రాంబాబు, ఎం.సత్యనారాయణ, జి.కృష్ణ, ఏఐటీయూసీ నాయకులు జి.వామనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సన్ రేజయ్యాడు

- ప్రతాపం చూపిన సూర్యుడు
- రోడ్లు ఖాళీ.. బయటకు రాని నగరవాసులు



శీతల పానీయాల దుకాణం వద్ద నగర వాసులు



వాహనానికి గొడుగు కట్టుకుని వెళుతున్న దివ్యాంగుడు

అల్లిపురం: ఏప్రిల్‌లోనే ఎండలు మండిపోతున్నాయి. ఆదివారం సన్ రేజయ్యాడు. వేసవి, ఎండ వేడిమితో నగరవాసులు విలవిల్లాడారు. ఆదివారం నగరంలో 34 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదయింది. ఉదయం 9 గంటల నుండే భానుడు తన ప్రతాపం చూపాడు. ఎండ వేడిమికి రోడ్లపై జనసంచారం పలుచబడింది. తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు గొడుగులు, టోపీలతో బయటికి వచ్చారు. రోడ్డుపై వెళుతుంటే వేడి సెగ ముఖానికి తగిలినట్లు అనిపించింది. వేడికి బెదిరిపోయిన నగరవాసులు శీతల పానీయాలు, చెరుకురసం, పండ్ల రసాలు, కొబ్బరి బొండాలను ఆశ్రయించారు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఒక్కరీతిన సూర్యుడు తన ప్రతాపాన్ని నగరవాసులకు రుచి చూపించడంతో రోడ్లు దాదాపు ఖాళీగా కనిపించాయి.



వయ్యారి భామ.. నీ హంస నడక

సందడిగా తెలుగమ్మాయి ఆడిషన్స్





టీచర్‌రోడ్డు: సంప్రదాయ వస్త్రాలు ధరించిన అందమైన తెలుగమ్మాయిలు మెరుపు తీగల్లా హంస నడకతో ఆకట్టుకున్నారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం తెలుగు అమ్మాయి పోటీల ఆడిషన్లు జరిగాయి. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా కట్టూ బొట్టుతో బాపు బొమ్మలా తయారై.. ర్యాంప్‌వాక్‌తో అదరహో అనిపించారు. తెలుగు మహిళ, తెలుగు అమ్మాయి రెండు విభాగాల్లో నిర్వహించిన ఆడిషన్లలో తదుపరి పోటీలకు కొంత మందిని ఎంపిక చేసినట్లు నిర్వాహకుడు వీరుమామ తెలిపారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా శ్రీమతి ఆంధ్రప్రదేశ్ విజేత శాంతి, నారి శోభ, శోభ కేత, ఆరిఫా వ్యవహరించారు.

వీధి బాలల భవితకు భరోసా

- అనాథలకు అండగా హాస్టళ్లు
- భీమిలి, చినగదిలిలో వసతి కేంద్రాలు
- ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక సిబ్బంది



ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థులు

విశాఖ విద్య: ఏ దిక్కూలేని వారికి ప్రభుత్వమే పెద్ద దిక్కుగా మారింది. నా అనేవారు లేక దీనావస్థలో ఉన్న వీధి బాలలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భరోసాగా నిలుస్తోంది. అనాథలు, తల్లిదండ్రులు లేని చిన్నారులు, వీధి బాలలు, హెచ్‌ఐవీ పీడిత బాల బాలికలు, సెక్స్ వర్కర్ల పిల్లలకు అండగా 'నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవసియ హాస్టళ్లు' పేరిట ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసింది. విశాఖపట్నం జిల్లాలోని భీమునిపట్నం, చినగదిలిలో సమగ్ర శిక్ష అభియాన్ అధికారుల పర్యవేక్షణలో వీటిని నిర్వహిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలకు వీటి నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. ఇక్కడ పిల్లలకు సకల సౌకర్యాలు కల్పించి.. రుచికరమైన పౌష్టికాహారం అందించి ప్రయోజకులుగా తీర్చిదిద్దేలా ప్రభుత్వం నిధులు సమకూరుస్తోంది.

'అందరికీ విద్య' నినాదంతో..

వెనుక వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందిస్తోంది. విద్యతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమనే ఆశయంతో విద్యా హక్కు చట్టం పటిష్టంగా అమలు చేస్తోంది. 14ఏళ్లలోపు పిల్లలంతా పనుల్లో కాకుండా బడిలోనే ఉండేలా క్షేత్రస్థాయిలో పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. కొన్ని ప్రత్యేక పరిస్థితులు కారణంగా చదువులకు దూరమవుతున్న అనాథలకు సైతం అండగా నిలిచి, చదువులు దరిచేర్చాలనే గొప్ప సంకల్పంతో వసతి గృహాలను నిర్వహిస్తోంది.

కేంద్రాల్లో సకల సౌకర్యాలు

భీమునిపట్నంలో 147 మందికి ఆసరా కల్పిస్తూ వసతి గృహం ఏర్పాటు చేశారు. వీరికి ఇదే చోట పాఠశాలను సైతం నిర్వహిస్తున్నారు. ఇక్కడ 1 నుంచి 10వ తరగతి వరకు విద్యనందిస్తున్నారు. చినగదిలిలో 70 మందికి హాస్టల్ ఏర్పాటు చేశారు. వీరంతా చుట్టుపక్కల గల ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి వస్తూ.. ఇక్కడ వసతి పొందుతున్నారు. వసతి గృహంలో రుచికరమైన పౌష్టికాహారంతో పాటు సకల సౌకర్యాలు కల్పించారు. వసతి గృహాల్లోనే ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ.. ఇతరులతో పోటీ పడేలా ఇక్కడి సిబ్బంది తర్ఫీదు ఇస్తున్నారు. సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు తరచూ హాస్టళ్లను సందర్శించి వారికి మరింత మెరుగైన సేవలందించేలా పర్యవేక్షిస్తున్నారు. చదువులతో పాటు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేసేలా వైద్య సిబ్బందిని కూడా నియమించారు.

వేసవిలోనూ కొనసాగిస్తాం



ప్రత్యేక పరిస్థితులు కారణంగా చదువులకు దూరమవుతున్న పిల్లల కోసం ప్రభుత్వ ఆధ్వర్యంలో వసతి గృహాలను నిర్వహిస్తున్నాం. వీటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఇక్కడ పనిచేసే సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇటీవలే మంజూరయ్యాయి. పిల్లలు కోరిక మేరకు వేసవిలో ఈ కేంద్రాలను కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

–వానపల్లి శైలజ, ప్రత్యామ్నాయ పాఠశాలల కో–ఆర్డినేటర్, విశాఖ జిల్లా

సద్వినియోగమయ్యేలా శ్రద్ధ చూపాలి



ప్రభుత్వం గొప్ప సంకల్పంతో వసతి గృహాలను నిర్వహిస్తోంది. అనాథలు, తల్లిదండ్రులు లేని పిల్లలు, హెచ్‌ఐవీ పీడితులు, వీధి బాలల అభివృద్ధి కోసమని ఏర్పాటు చేసిన వసతి గృహాల ద్వారా మెరుగైన ఫలితాలు వచ్చేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలి. వీటిని నిరంతరం పర్యవేక్షించాలి. ఏమైనా ఇబ్బందులు ఉంటే కమిషన్ కూడా జోక్యం చేసుకుంటుంది.

–డాక్టర్ జి.సీతారాం, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు